క్లుప్తంగా

108 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా ఇన్‌చార్జ్



ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ప్రసూతి హాస్పిటల్ ప్రాంగణంలో 108 వాహన కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ భరత్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది హాజర్ రిజిస్టర్, ఎక్విప్‌మెంట్స్, వెహికల్ మెయింటెనెన్స్, నెలవారి కేసుల వివరాల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి అభినందించారు. ఆయన వెంట స్టాఫ్ మెడికల్ టెక్నీషియన్ క్రాంతికుమార్, పైలెట్ చంద్రసేనా ఉన్నారు.

ఆర్టీసీ ఎండీని కలిసిన టీఎంయూ నేతలు



హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డిని వరంగల్ రీజియన్‌కు చెందిన టీఎంయూ నాయకులు కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎండీ వై.నాగిరెడ్డిని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు ఎస్.కె.వై.పాషా, కార్యదర్శి సీహెచ్.జితేందర్‌రెడ్డి, నాయకులు ఎండీ.గౌస్, బీఆర్.కుమార్, వీహెచ్.కిరణ్, పి.పి.రెడ్డి, ఎస్.వై.రెడ్డి, కె.అశోక్ రెడ్డి, ఎం.ఎస్.రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డిని ఆర్టీసీ కరీంనగర్ జోన్ కళాకారులు ఆదివారం వరంగల్–1 డిపోలో కళాకారుడు సాంబయ్య ఆధ్వర్యంలో కలిశారు.

ఎన్‌సీసీ కేడెట్లను అభినందించిన ప్రిన్సిపాల్



కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి చెందిన ఎయిర్‌వింగ్ ఎన్‌సీసీ కేడెట్లు బెంగళూరులోని ఆల్‌ఇండియా వాయిసైనిక్ క్యాంపులో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇచ్చి విజయవంతంగా ముగించుకొని తిరిగి వచ్చిన విద్యార్థులను సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, ఫ్లెయింగ్ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్ అభినందించారు. ఆల్ ఇండియా వాయిసైనిక్ క్యాంపులో విమాన శిక్షణతో పాటుగా డ్రిల్, పాయింట్ టూ ఫైరింగ్‌లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చారని వారు కొనియాడారు. ఎన్‌సీసీ కేడెట్లు డి.అరవింద్, ఎ.మణికంఠ, ఉదయ్‌కిరణ్, లావణ్యలను వారు అభినందించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

కాజీపేట : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించినప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి ఎదగడానికి అవకాశం ఉంటుందని గ్రూప్ కెప్టెన్ జీ జే.రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుర్రపు సుధాకర్, జీజేరావు ట్రస్ట్ డైరెక్టర్ పుష్ప, ప్రధానోపాధ్యాయులు ఫ్రాన్సిస్, పూర్వ విద్యార్థులు జయదేవ్ పాల్గొన్నారు.

వాటర్ కూలర్ ప్రారంభం

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాటర్ కూలర్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఆ కళాశాలలో 1979–1982 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 40 వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను ఇటీవలనే బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రహమాన్, సిహెచ్.రాజేశం, రమణమూర్తి, దయాసాగర్, డేవిడ్, రమేష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

26న ఓరుగల్లు గాన కళావైభవం

నయీంనగర్ : ప్రజావాగ్గేయకారుడు, శాస్త్ర మిత్ర సభ్యుడు మైస ఎర్రన్న ఈ నెల 26న కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఓరుగల్లు గాన కళా వైభవం కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం 53వ డివిజన్ ఆదర్శకాలనీలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శాస్త్రమిత్ర అధ్యక్షుడు పరికిపండ్ల వేణు మాట్లాడుతూ 26న జరిగే ఓరుగల్లు గాన కళా వైభవంలో మైస ఎర్రన్న అభ్యుదయ గీతాలను సాహిత్యం చూడకుండా ఏకధాటిగా 100 పాటలతో 5 గంటల పాటు వేదిక పూన పాటల సునామీని సృష్టించనున్నారని వారు తెలిపారు. శ్రామన్నారాయణ, ధర్మప్రకాష్, నాగరాజం, శ్రీనివాస్, లింగమూర్తి, సోమయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాకతీయ పైలాన్

- పర్యాటకులను ఆకర్షించడానికి రూ.2.50 కోట్లతో అభివృద్ధి
- పైలాన్ చుట్టూ ఊడిపోతున్న కాకతీయ రాజుల బొమ్మలు

కాజీపేట : పట్టణంలోని 61వ డివిజన్ సిద్ధార్థనగర్ వడ్డేపల్లి రిజర్వాయర్ కట్టపై పుష్కరకాలం కింద ఆవిష్కరించిన కాకతీయ పైలాన్ శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకులను ఆకర్షించడానికి దాదాపు రూ.2.50 కోట్లతో కట్టను అభివృద్ధి చేశారు. చిన్న, పెద్దలను ఆకట్టుకునేలా పలు అభివృద్ధి పనులతో అందంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో మున్సిపల్, కూడా అధికారులు 2012లో ఒక పైలాన్‌ను అప్పటి కేంద్రమంత్రి బలరాంనాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పైలాన్‌పై కంచుతో తయారు చేసిన కాకతీయ రాజుల బొమ్మలను ఏర్పాటు చేశారు. అధికారుల చర్య ఆరంభ శూరత్వంలా మారడంతో పైలాన్ క్రమేపి శిథిలావస్థకు చేరుకుంది. పైలాన్ చుట్టూ అమర్చిన బొమ్మలు ఒక్కొక్కటిగా అన్ని ఊడిపోతున్నాయి. పైలాన్ గద్దె చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ రాయి పూర్తిగా ధ్వంసమైంది. మున్సిపల్, కూడా అధికారులు పైలాన్‌ను పట్టించుకోకపోవడం బాధాకరం. అధికారులు స్పందించి పైలాన్‌కు మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.



వడ్డేపల్లి కట్టపై శిథిలావస్థకు చేరిన పైలాన్



పైలాన్‌పై ఊడిపోయిన బొమ్మలు

రశీదు ఇవ్వకుండా వ్యాపారుల దోపిడీ

- దక్షణాది రాష్ట్రాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్

ఖిలా వరంగల్ : తగ్గిన జీఎస్టీ ధరలతో విక్రయాలు కాకుండా పాత ధరలకే సరైన రశీదు ఇవ్వకుండా వినియోగదారులను వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని దక్షణాది రాష్ట్రాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ ఆరోపించారు. దోపిడీ చేస్తున్న తీరును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్ర వినియోగదారుల కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సమఖ్య కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మురహరి కార్తీక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారుల సభ్యులు స్వయంగా టెస్టు పర్చేజ్ ద్వారా కొనుగోలుకు వెళ్తే నిత్యావసర సరకులు తగ్గిన జీఎస్టీ ధరలు కాకుండా పాత ధరలకు విక్రయిస్తూ, బిల్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర టోల్ ఫ్రీ నెంబర్ 1915 వాట్సాప్ నెంబర్ 8800001915ల ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. దక్షణాది రాష్ట్రాల సమాఖ్య న్యాయ సలహాదారు బండి అనిల్‌కుమార్, కో–ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, వెంకటేష్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొగిలిచెర్ల సుదర్శన్

కేయూ స్పోర్ట్స్ బోర్డు అభివృద్ధికి కృషి

- వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ బోర్డు అభివృద్ధికి కృషి చేస్తానని వివిధ క్రీడలకు సంబంధించి క్రీడాకారులకు సదుపాయాలు కల్పిస్తామని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జె.సోమన్న, జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.సునీల్‌రెడ్డి ఇతర బాధ్యులు సోమవారం వీసీని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు స్పోర్ట్స్ బోర్డుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వీసీ మాట్లాడుతూ ఒకసారి స్పోర్ట్స్ బోర్డును సందర్శించి అక్కడి సదుపాయాలకు సంబంధించిన వాటిని పరిశీలించి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభివృద్ధికి, క్రీడాకారులకు వివిధ సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీసీని కలిసిన వారిలో అసోసియేషన్ కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కుమారస్వామి, రమేష్, సహాయ కార్యదర్శులు మట్టెడకుమార్, కె మధుకర్, కార్యవర్గసభ్యులు ఉన్నారు. అలాగే రిజిస్ట్రార్ రామచంద్రంను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.



వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసిన అసోసియేషన్ నూతన కమిటీ బాధ్యులు

మాజీ స్పీకర్ జన్మదిన వేడుకలు

హన్మకొండ చౌరస్తా : మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనచారి జన్మదిన వేడుకలు తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం, జిల్లా స్వర్ణకారుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని టైలర్‌స్ట్రీట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణమాచార్యులు, కోటేశ్వరచారీ, విష్ణువర్ధన్, సదానందం పాల్గొన్నారు.

వర్షంతో తడిసిన మక్కలు, పత్తి బస్తాలు



మార్కెట్‌లో ఆరబోసిన మక్కలు

వరంగల్ : ఏనుమాముల మార్కెట్‌లో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో మక్కలు తడిసిపోయాయి. మార్కెట్‌లో విక్రయించేందుకు సమీప గ్రామాలకు చెందిన రైతులు మక్కలను ఆదివారం సాయంత్రమే అపరాల యార్డుకు తీసుకొచ్చి ఆరబోశారు. వర్షం రావడంతో సుమారు 15 క్వింటాళ్ల వరకు మక్కలు తడిసినట్లు యార్డు సిబ్బంది తెలిపారు. యార్డులో ఉన్న టార్పాలిన్లు కప్పడంతో పూర్తిగా తడవలేదని నర్సంపేటకు చెందిన రైతు అజ్మీరా సరోజన తెలిపింది. మక్కలు తడిసినప్పటికి ఆరబోసిన అనంతరం రైతులకు గరిష్ట ధరలు ఇప్పిస్తామని మార్కెట్ అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలను పరిగణలోకి తీసుకుని మక్కలను ఆరుబయట కాకుండా యార్డుల్లో పెట్టుకోవాలని మార్కెట్ అధికారులు రైతులను కోరుతున్నారు. అదేవిధంగా కొన్ని పత్తి బస్తాలు స్వల్పంగా తడిసాయి. స్వల్పంగా తడవడంతో ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు.

క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్

- కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన జట్టు క్రీడాకారులతో ప్రొఫెసర్ వై.వెంకయ్య

మామునూరు : యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, రిటైర్డ్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్, స్పోర్ట్స్ డైరెక్టర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడా మైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సునీల్‌రెడ్డి సహకారంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీ టోర్నమెంట్స్ సోమవారం సాయంత్రం ముగిశాయి. వాగ్దేవి కాలేజీ డైరెక్టర్ సీహెచ్.వాణిదేవి, సీహెచ్.సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. యువత అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం సింగరేణి కాలరీస్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కొత్తగూడం జట్టు చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంది. పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలే లక్ష్మీపతి, పలు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు వసతులు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు

హన్మకొండ అర్బన్ : కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణితో పాటు కలెక్టరేట్‌కు వివిధ రకాల పనుల నిమిత్తం వచ్చే వయోవృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి గోపాలపురం బాధ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో సమర్పించిన వినతులపై సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం కార్యదర్శి తేరాల యుగంధర్, సంయుక్త కార్యదర్శి చిదురాల సత్యనారాయణ, మార్క రవీందర్ గౌడ్, తాడూరి లక్ష్మీనారాయణ, గంగారపు యాదగిరి, గుంటి సీతారామారావు, శీలం వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

బార్ షాప్‌లో యువకుల దాడి

- యజమాని ఫిర్యాదుతో ఇరువర్గాలపై కేసు

వరంగల్ : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధురానగర్ కాలనీలోని కాళిక బార్ షాప్‌లో కాశిబుగ్గకు చెందిన నలుగురు యువకులపై ఓవర్గం యువకులు మూకుమ్మడిగా దాడి చేయడం కలకలం రేపుతోంది. ఆదివారం రాత్రి సుమారు 9.30 గంటలకు 'ఓ వర్గం' యువకులు మద్యం తాగేందుకు బార్‌లోని జనతా కౌంటర్‌కు వచ్చారు. అదే సమయంలో కొంతమంది స్థానిక యువకులు అదే కౌంటర్‌లో మందు తాగేందుకు వచ్చారు. ఈ సమయంలో ఓ వర్గం యువకులు గొడవ పడుతుండగా స్థానిక యువకులు ఎందుకు అన్నా గొడవ పడుతున్నారు. మాట్లాడుకోవచ్చు కదా అనడంతో వారంతా మూకుమ్మడిగా స్థానిక యువకులపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. గొడవ విషయం తెలిసిన వెంటనే ఏనుమాముల పోలీసులకు సమాచారం అందించినట్లు బార్ యాజమాని తెలిపాడు. కాగా ఇతర రాష్ట్రానికి చెందిన ఈ యువకులు ఎంహెచ్‌నగర్‌లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని వృత్తి పనులు చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిసింది. తమపై అకారణంగా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తమపై ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్న దాడికి పాల్పడిన 'ఓ వర్గం' యువకులు తూర్పునాయకుడి ముఖ్య అనుచరుని వద్దకు వెళ్లి పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని కోరినట్లు సమాచారం. ఏనుమాముల పరిధిలోని బార్, వైన్స్ షాపుల్లో ఇలాంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయన్నారు. ప్రతి రోజు గొడవలు పడడమే కాకుండా చుట్టు ఉన్న కాలనీల్లోకి వచ్చి వాహనాలపై కూర్చుని మద్యం సేవిస్తున్నారన్నారు. షాపు యాజమాని ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



దాడికి పాల్పడిన యువకుల సీసీ ఫుటేజీ

మూక్స్ శిక్షణ ప్రారంభం

- నిట్ రాయపూర్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకువస్తున్న మూక్స్(మాసీవ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్స్)లను సద్వినియోగం చేసుకోవాలని నిట్ రాయపూర్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో వారం రోజుల మూక్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఎన్వీ.రమణారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అర్థం చేసుకుని విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించాలని తెలిపారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ఇందిరా కోనేరు యాలవర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్వీ.రమణారావు

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

న్యూశాయంపేట/హన్మకొండ అర్బన్ : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడ్డ రాకేశ్ కిషోర్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, వరంగల్ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అధ్యడు కట్ల రాజేశ్ మాదిగ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ అధ్యక్షతన జిల్లాల కలెక్టరేట్ ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేశ్ కిషోర్ షూస్ విసిరి దాడి చేయడం అనాగరికమైందన్నారు. దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులు ఆపకపోతే భవిష్యత్‌లో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దేశంలో ఉన్న దళితులను అందర్నీ ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చేపడతామని హెచ్చరించారు. అనంతరం వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ విజయలక్ష్మికి, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ , కట్ల రాజేశ్ మాదిగ, ఎంఎస్పీ నాయకులు సూరన్న, ప్రణయ్‌దీప్, సిద్దు, అందె రవి, మల్లన్న, పూర్ణయ్య, మల్లేష్, కుమార్, దామెరకిషోర్, ప్రమోద్, కరుణాకర్, నాని, వీర రవి, సుధాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, నాయకులు పవన్, వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు సాగర్, రాజు, నారాయణ, వెంకటస్వామి, రవీందర్, రజినికుమార్, స్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.



న్యూశాయంపేట : వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు



హన్మకొండ అర్బన్ : కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫోర్ట్‌రోడ్డులో బొడ్రాయికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్ : వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని రుద్రమాంబనగర్‌లో సోమవారం లక్ష్మీ, భూలక్ష్మి బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేదపండితులు భాస్కర్‌చారి బృందం నేతృత్వంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు మహాగణపతి పూజ, సర్వప్రాయశ్చిత్తం, ద్వారతోరణపూజ, పుణ్యాహవచన మాతృకా పూజలు, నవగ్రహపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, బైరబోయిన ఉమ హాజరై బొడ్రాయిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అచ్చ వినోద్‌కుమార్, దామోదర్, సారంపాణి, శ్రీనివాస్, వీరభద్రం, రవికుమార్, భరత్, నాగరాజు, క్రాంతికుమార్, రాజు పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సంక్షిప్త సమాచారం

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

మామునూరు : ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో మాధవ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా సొసైటీ వైస్ చైర్మన్ సోల్తి భూమాత, రామస్వామి హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఆకారపు రాజగోపాల్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్, సోల్తి రాజగౌడ్, బొజ్జం సుధాకర్ పాల్గొన్నారు.

నమ్మించి మాలల గొంతు కోసిన కాంగ్రెస్

నయీంనగర్ : మాలలంటేనే కాంగ్రెస్– కాంగ్రెస్ అంటేనే మాలలు అనుకునే మమ్మల్ని ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలల గొంతు కోసిన సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాలమహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ ఎస్, రత్నాకర్ హెచ్చరించారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర జరుగుతోందన్నారు. మాల సామాజిక వర్గాన్ని రాజకీయ పార్టీలు తొక్కేస్తా ఉంటే మాల ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం ఘోర అన్యాయమన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

విద్యారణ్యపురి : విపత్తుల పై అప్రమత్తంగా ఉండాలని మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ అన్నారు. సోమవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం, మేరా యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు విపత్తుల తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు.అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఆఫీసర్ భద్రయ్య గ్యాస్ పేలినప్పుడు రోజు వారి వంట చేసుకుంటున్నప్పుడు గ్యాస్ పరిసరాల ఎలా ఉంచుకోవాలనేది వివరించారు. ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు మురళి, డాక్టర్ స్ఫూర్తి సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన ఉత్సవ కమిటీ

ఖిలా వరంగల్ : వరంగల్ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును సోమవారం వరంగల్ ఉర్సుగుట్ట నరకాసుర వధ ఉత్సవ కమిటీ మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మరళీధర్‌రావును ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రికను అందజేయగా ఉత్సవాలకు ఆయన రూ.లక్షల నగదు అందజేశారు. మురళీధర్‌రావును కలిసిన వారిలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి, గౌతం, రామ్మూర్తి, బాలకొమురెల్లి, కుమార్, శెట్టి మోహన్, కుమారస్వామి, నరసింహ ఉన్నారు.

కేయూ వీసీని కలిసిన ప్రవాసభారతీయుడు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి , ప్రవాసభారతీయుడు, అమెరికాలోని ప్రముఖ ఫార్మసీ పారిశ్రామికవేత్త రాజు తోట సోమవారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కేయూ ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సంబంధించిన పలు అంశాలను ఈసందర్భంగా చర్చించారు. రాజును వీసీ శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్ : ఆన్‌లైన్ సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.6,450 నగదును స్వాధీనం చేసుకుని నిర్వాకుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్. రాజు తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వేగేట్ ప్రాంతం శాకరాశికుంట శాంతినగర్‌కు చెందిన బండి రాజు ఓ ఇంట్లో రహస్యంగా ఆన్‌లైన్ సట్టా నిర్వహిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌కు అందిన పక్కా సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం దాడి చేశారు. రాజును అదుపులోకి తీసుకొని రూ.6,450 నగదు, ఆన్‌లైన్ సట్టా స్లిప్స్, కార్డులను స్వాధీనం చేసుకుని రాజుపైకేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్ కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఆర్ఎస్సై భానుప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, కమ్మరివాడ, లష్కర్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

గణేష్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఖిలా వరంగల్ : వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీ అధ్యక్షుడిగా మిరియాల శ్రీనివాస్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రంగశాయిపేట డెవలప్‌మెంట్ సొసైటీ కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటేశ్వరకాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, భిక్షపతి, రాకేశ్, ఎల్లయ్య, రంజిత్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికలు

కాజీపేట : కాకతీయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఈ నెల 16న వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.శ్రీనివాస్, ఎం.కృష్ణమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. చాలా కాలం తర్వాత హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్‌లో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతి ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు సంబంధించి జిల్లా పక్షాన ఎంపికలు ఉంటాయన్నారు.

ఏఐసీసీ అబ్జర్వర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

హన్మకొండ : ఏఐసీసీ అబ్జర్వర్‌ను 58వ, 59వ డివిజన్ హనుమకొండ ఇందిరానగర్, ఎన్జీవోస్ కాలనీ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నవజ్యోతి పట్నాయక్‌ను మహిళా కాంగ్రెస్ 59వ డివిజన్ కార్యదర్శి తేళ్ల సుగుణ, నాయకులు తేళ్ల కిశోర్, సమ్మయ్య, సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక కాంగ్రెస్ పార్టీ పరిస్థితులపై చర్చించారు.

కారు బోల్తా

హసన్‌పర్తి : యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని చింతగట్టు క్యాంప్ సమీపంలో ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై కల్యాణ్ సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జేసీబీతో కారును సరి చేశారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టారు.

ఈ ఏడాది కొత్త నోములు లేవు

కాజీపేట : ఈ ఏడాది కేదారేశ్వర వ్రతం (కొత్త నోముల) చేసుకోవడానికి అవకాశం లేదని అభయాంజనేయస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న మంగళహారతులు, దీపావళి ధనలక్ష్మి పూజలు చేసుకోవాలన్నారు. 21 మంగళవారం కేదారేశ్వర వ్రతం ఆచరించి 22న బుధవారం దేవుడిని ఎత్తుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన తొట్ల రాజుయాదవ్

హన్మకొండ : రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన మడికొండకు చెందిన మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హనుమకొండలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు రాజు యాదవ్‌ను శాలువతో సన్మానించారు.